క్లుప్తంగా

లోకకవి వేమన జయంతి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులందిస్తున్న ప్రభాకర్

రామడుగు: మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం లోకకవి వేమన జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేమన పద్య పోటీలు, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మోహన్, ఫౌండేషన్ ప్రతినిధి వైరాగ్యం ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీలు

శంకరపట్నం: కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలను గురువారం టీపీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో ఎన్నుకున్నామని పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బస్వయ్య తెలిపారు. మండంలోని వంకాయగూడెం గ్రామశాఖ అధ్యక్షుడిగా పైడిపెల్లి శ్రీనివాస్, రాజాపూర్ అధ్యక్షుడిగా చింతిరెడ్డి రాజిరెడ్డి, చింతగుట్ట అధ్యక్షుడిగా ఖాజామోహీనొద్దీన్, అంబాల్‌పూర్ అధ్యక్షుడిగా ఏగుర్ల ఎల్లయ్య ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

యువకుడి కళ్లు సజీవం



సంపత్ (ఫైల్)

చొప్పదండి: హుస్నాబాద్‌కు చెందిన ధరావత్ సంపత్ (31) నగునూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సతీశ్ ద్వా రా యువకుడి నేత్రాలను సేకరించిన చొప్పదండి లయన్స్ క్లబ్ సభ్యులు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపించారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి నుంచి ఇందిరానగర్ వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. రెండు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడుతుండగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి సమస్యనను తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారు. గురువారం మరమ్మతు పనులను సర్పంచ్ మేడి అంజయ్య, ఉప సర్పంచ్ పొన్నం అనిల్‌గౌడ్ ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

కరీంనగర్: మంత్రి గంగుల కమలాకర్ తండ్రి మల్లయ్య ఇటీవల మరణించగా.. గురువారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ మంత్రి గంగుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంట ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్, జిల్లా కన్వీనర్ అనిల్, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

హుజూరాబాద్: వినియోగదారులు విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని విద్యుత్ సహాయ గణాంకాధికారి పొలంపల్లి జనార్దన్ కోరారు. గురువారం పట్టణంలో పరిశ్రమలు, గృహ కనెక్షన్ల పాత బకాయి వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 రోజులలోపు సర్ చార్జీలు, బకాయిలు వెంటనే చెల్లించాలని లేదంటే విద్యుత్ శాఖ ఆదేశానుసారం చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈలు శ్రీనివాస్, రవీందర్, వీరచారి, జేఏవోలు శ్రావణ్ కుమార్, నవీన్ ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు నాటుకోళ్లు పంపిణీ చేస్తున్న బాలవికాస సంస్థ సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మహిళలు ఆర్థికంగా కుటుంబాలకు అండగా నిలవాలని బాల వికాస సెంటర్ మేనేజర్ ఖాజాబీ అన్నారు. పట్టణంలోని కోర్టు సమీప ఆవరణలో గురువారం బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నాటుకోళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. ఈ క్రమంలోనే మహిళలకు సంస్థ తరుపున 210 నాటు కోళ్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్స్ లీలావతి, మమత, రజిత, మహిళలు పాల్గొన్నారు.

సస్యశ్యామలం అయ్యేదెన్నడో..?

- మండలంలోని తొమ్మిది గ్రామాలకు సాగునీటి సౌకర్యం
- ఎనిమిది గ్రామాల్లో బోర్‌వెల్, వ్యవసాయబావుల కింద సాగు
- ఏటా పంట చివరి దశలో ఎండుతున్న పొలాలు
- గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు పూర్తయితే లాభం
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు



బొమ్మనపల్లిలో పశువులకు మేతగా ఎండిన వరిపొలం(ఫైల్)

చిగురుమామిడి: మండలంలో కెనాల్ సౌకర్యం ఉన్న గ్రామాల్లో వరిసాగు భారీగా పెరిగింది. కొన్ని గ్రామాల్లో తక్కువగా సాగవుతోంది. మండలంలో 17 గ్రామాలున్నాయి. తొమ్మిది గ్రామాల నుంచి మిడ్‌మానేరు కుడికాల్వ ద్వారా సాగునీరు కింది ప్రాంతాలకు చేరుతోంది. దీంతో రైతులు 13వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. కెనాల్ సౌకర్యం లేని ఎనిమిది గ్రామాల్లో రైతులు వ్యవసాయ బావులు, బోర్‌వెల్ కింద దాదాపు ఎనిమిదివేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. సాగునీటి కొరత నుంచి గట్టేందుకు రైతులు మరోపక్క ఆరుతడి పంటలు మొక్కజొన్న, వేరుశనగ సాగుచేస్తున్నారు.

కెనాల్ సౌకర్యం ఉన్న గ్రామాలు

మిడ్‌మానేరు ప్రాజెక్టు ద్వారా తోటపల్లి సాగునీటి రిజర్వాయర్ నుంచి మండలంలోని ఓగులాపూర్, ఇందుర్తి, గునుకులపల్లి, ముదిమానిక్యం, రామంచ, చిన్నముల్కనూర్, సీతారాంపూర్, పీచుపల్లి, రేకొండ, గ్రామాల నుంచి సైదాపూర్ మండలం దుద్దెనపల్లి ద్వారా వంగరకు సాగునీరు సరఫరా అవుతోంది. ఈ గ్రామాల్లో సాగుపూర్తయ్యే వరకు పంటలకు నీరు అందుతోంది ఫలితంగా రైతులు ఆర్థికంగా వృద్ధిలోకి వస్తున్నారు.

కెనాల్ సౌకర్యం లేని గ్రామాలు

మండలంలోని నవాబుపేట్, కొండాపూర్, గాగిరెడ్డిపల్లి, చిగురుమామిడి, లంబాడిపల్లి, సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి గ్రామాల్లోని రైతులు సాగునీటి సౌకర్యం లేక వ్యవసాయబావులు, బోర్‌వెల్‌ల కింద వరి, ఇతర పంటలు సాగుచేస్తున్నారు.

పంట చేతికందకపోవడం

సాగునీటి సౌకర్యం లేని గ్రామాల్లో రైతులు యాసంగి వరి ఎనిమిది వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఏటా పొట్టదశలో పంట ఎండిపోతోంది. ఎండ తీవ్రత, భూగర్భ జలాలు అడుగంటిపోయి వేసిన కొద్దిపాటి వరి చేతికందకపోతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి రాక, సాగునీటి సౌకర్యం లేక ఆర్థికంగా నష్టపోతున్నామని, కెనాల్ వచ్చేదెన్నడు కష్టాలు తీరేదెన్నడు అంటూ వాపోతున్నారు.

ప్రాజెక్టు పూర్తయితే 8 గ్రామాలకు నీరు

అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు పూర్తయితేనే ఎనిమిది గ్రామాలకు సాగునీరు కాల్వల ద్వారా అందనుంది. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందోనని ఏళ్లుగా ఎదురుచూస్తూ ఉన్నారు. ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయించేదెప్పుడు, కాల్వల తవ్వకం పనులు పూర్తయ్యేదెన్నడూ అంటూ చర్చించుకుంటున్నారు.

పెట్టుబడి రాదు



పది ఎకరాల వ్యవసాయ భూమిలో నాలుగు ఎకరాల్లో వరి వేశాను. ఐదెకరాల్లో పత్తి, ఎకరంలో వేరుశనగ వేశాను. నీటి కొరతతో వేసిన కొద్దిపాటి వరి పంట చివరిదశలో నీటికొరతతో ఎండిపోతోంది. పెట్టుబడి కూడా రాని పిరిస్థితి నెలకొంది.

– వంతడ్పుల దిలీప్ కుమార్, రైతు, సుందరగిరి

సాగునీరు వచ్చేదెన్నడో..



రెండున్నర ఎకరాల్లో వరి, రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఎకరం నుంచి రెండెకరాల వరి పొట్ట దశలో ఎండిపోతుంది. సాగునీరు వచ్చేదెన్నడో, ఇబ్బందులు పట్టించునే వారు లేరు.

–తోట శ్రీనివాస్, రైతు, బొమ్మనపల్లి

ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్నం



గ్రామంలో నీటి ఎద్దడి ఎక్కువ, యాసంగిలో వరి కోతకు వచ్చే దశలో ఎండిపోతుంది. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం ఎదురుచూస్తున్నం, ఎన్నడు పూర్తవుతదో కష్టాలు ఎప్పుడు తీరుతాయో. అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు పూర్తిచేసి సాగునీరు అందిస్తే రైతులు బాగుపడతారు. లేదంటే ఏటా నష్టపోవాల్సిందే.

–పోతరవేని శ్రీనివాస్, రైతు, కొండాపూర్

ఏడాదిలోపు సాగునీరు

ప్రాజెక్టు రీడిజైనింగ్ పనులు నడుస్తున్నాయి. పరిహారం కోసం నిర్వాసితులు కోర్టులో కేసులు వేశారు. కోర్టు నుంచి క్లియరెన్స్ వచ్చింది. హుస్నాబాద్, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాల్లో కాల్వల తవ్వకం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. వచ్చే ఏడాదిలోపు చిగురుమామిడి మండలంలోని ఎనిమిది గ్రామాల రైతులకు సాగునీరు అందనుంది.

–ప్రశాంత్, డీఈఈ గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్టు

పంట పొలాల పరిశీలన



రామడుగు: తిర్మలాపూర్‌లో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు



తిమ్మాపూర్: పొలంపల్లిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రామడుగు: రైతులు తగిన జాగ్రత్తలతో వరిలో కాండం తొలిచే పురుగును అరికట్టాలని జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్, రాంచెంద్రాపూర్ గ్రామాలలో వ్యవసాయాధికారులతో వరి పంట పొలాలను పరిశీలించారు. పురుగు ఆశించితే చేపట్టాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యాస్మిన్, సర్పంచ్ బక్కశెట్టి నర్సయ్య, ఎం పీటీసీ మోడీ రవీందర్, ఏఈవో సంపత్ రైతులు పాల్గొన్నారు.

చొప్పదండి: వరిలో ప్రస్తుతం సూక్ష్మధాతువుల లోపాలు పెరిగాయని, నివారణకు అవసరమైన మందులను రైతులు పిచికారీ చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని రుక్మాపూర్‌లో మొగిపురుగు, తెగుళ్లు, ఇతర లోపాలను పరిశీలించేందుకు ఏవో వంశీక్రిష్ణతో కలిసి క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొగిపురుగు నివారణ, జింకు లోపంకు తీసుకునే చర్యలు వివరించారు. ఏఈవో ప్రసన్న కుమార్, రైతులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి గ్రామంలో వరిపొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా వుండే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి సురేందర్ తెలిపారు. నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మండల వ్యవసాయ అధికారి సురేందర్ తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, రైతులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కొత్త వినీత

చిగురుమామిడి: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ కొత్త వినీత కోరారు. గురువారం జెడ్పీటీసీ గీకురు రవీందర్‌తో కలిసి ఇందుర్తి ప్రభుత్వ పాఠశాలలో వంటగది నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనఊరు మనబడి కార్యక్రమం కింద చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. మండలంలోని 11 పాఠశాలల్లో మనఊరు మనబడి కార్యక్రమం కింద మరమ్మతు పనులు కొనసాగుతున్నాయని, ఇందుర్తి పాఠశాలకే రూ.47 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. జెడ్పీటీసీ గీకురు రవీందర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అందె స్వరూప, మాజీ జెడ్పీటీసీ అందె స్వామి, ఎంపీడీఓ నర్సయ్య, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్‌రావ్, ఏఈ కృష్ణమూర్తి, పంచాయతీకార్యదర్శి వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు విష్ణమాచారీ, ఎస్‌కె సిరాజ్‌పాషా, శ్యామల, మౌనిక, యశోద, ఎస్ఎంసీ చైర్మన్ ఉస్మాన్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఇంధన సర్దుబాటు చార్జీల వసూలు విరమించుకోవాలి

మానకొండూర్: వినియోగదారులపై ఇంధన సర్దుబాటుపేరిట అదనపు చార్జీలు వసూలు చేయడం విరమించుకోవాలని సీపీఎం జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ ఒక ప్రకటనలో ఖండించారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండా డిస్కంలు విద్యుత్ వినియోగదారుల నుంచి వేలాదికోట్ల రూపాయలు అక్రమంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

ఆర్డీవోకు వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలను తరలించొద్దంటూ గురువారం కేసీ క్యాంపులోని ఆర్డీవోకు ఏబీఎస్‌బీ, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలను హుజూరాబాద్ నుంచి 20 కిలోమీటర్ల దూరంలోకి తరలించడం ద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. పట్టణంలోనే శాశ్వత భవనం నిర్మించి, విద్యార్థుల సమస్యలను తీర్చాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి హరికృష్ణ, కేశబోయిన రాము, సుమన్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా మహాలక్ష్మీ నారాయణపూజ



పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో గురువారం శ్రీ భక్త మార్కండేయ దేవాలయంలో చండీయాగం కార్యక్రమంలో భాగంగా వేదపండితులు శ్రీ మహాలక్ష్మీ నారాయణపూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగల సంగీత, వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, భక్తులు నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



జమ్మికుంట: రశీదు ఇస్తున్న ఆలయకమిటీ సభ్యుడు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంటలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి భక్తులు, దాతలు విరాళం అందజేశారని ఆలయ అభివృద్ధి కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి రాజేందర్ గురువారం తెలిపారు. పట్టణానికి చెందిన గర్రెపల్లి అరుణరాజమౌళి రూ.10,116, పల్లెర్ల కిరణ్ రూ.10,000,చదువు రాజేందర్‌రెడ్డి రూ. 10,116,మిరుపాల తిరుపతిరావు రూ.10,116, గుండా సాయిరాం రూ.5,116, మాడిశెట్టి కుమారి ఈశ్వరయ్య రూ.10,116 ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దాతలకు రశీదులు అందజేశారు. స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి హాజరు కావాలని కోరారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

హుజూరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో వెంకట నరసింహారెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మాంటిస్సోరి విద్యాసంస్థల చైర్మన్ జోస్ నడుంతుండం ఆదేశానుసారం హెచ్ఎం గీతాషాజు అధ్యక్షతన గురువారం మాంటిస్సోరి పాఠశాల వార్షిక క్రీడోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ప్రతిరోజు వ్యాయామం చేయాలని, పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు టెక్నాలజీతో విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం జోస్ నడుం తుండం మాట్లాడుతూ...సమాజాభివృద్ధి కోసం మంచి పౌరులను అందించాలన్న ఉద్దేశంతో ప్రతి విద్యార్థికి సంస్కృతి, సాంప్రదాయాలతో పాటు చదువుకు అనుసంధానంగా క్రీడా విద్యను అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన క్రీడా నాటికలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల ప్రెసిడెంట్ గంగ్ర సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు నూకల శ్రీనివాసరావు, షాజు థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



హుజూరాబాద్: కళ్లద్దాల పంపిణీలో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో గురువారం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమైంది. 18 ఏళ్లు నిండినవారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కంటి సమస్యల నిర్మూలనకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

- నెట్‌వర్క్

రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ నుంచి రుక్మాపూర్ వరకు రహదారి మరమ్మతుకు రూ. 2.85 కోట్లు మంజూరయ్యాయని జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, కొలిమికుంట సర్పంచ్ తాళ్లపల్లి సుజాత తెలిపారు. గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అక్కడ అలా.. ఇక్కడ ఇలా' కథనానికి స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గతంలోనే నిధులు మంజూరయ్యాయని, కొలిమికుంటలో కొంతవరకు మరమ్మతు పనులు జరిగాయని, మిగితాది త్వరలోపూర్తి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో పెద్ది శంకర్, సత్తు తిరుపతి, సత్తు నర్సయ్య, ఆకుల సురేశ్, సత్తు తిరుపతి, ఏగోలపు రాజు, గుర్రాల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

కరీంనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కరీంనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం 28 ఏళ్లుగా ఉద్యమం జరుగుతుందన్నారు. పండిత్ దీన్‌దయాల్ అంత్యోదయ స్ఫూర్తితో ఎదిగిన ఎమ్మార్పీఎస్ మొదటి నుంచి బీజేపీ చేస్తున్న పోరాటానికి మద్దతునిస్తూ వస్తుందని తెలిపారు. 1996లో తిరుపతిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలుపుతూ తీర్మానం చేసిందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో భద్రాచలంలో జరిగిన రాష్ట్ర కమిటీలో ఎస్సీ వర్గీకరణను బలపరుస్తూ తీర్మానం చేసిందని గుర్తు చేశారు. విషయమై చొరవ తీసుకొని రాష్ట్ర, జాతీయ నాయకులందరినీ కలిసి ఒత్తిడి తీసుకొచ్చి పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా తమవంతు కృషి చేయాలని కోరారు. నాయకులు రాజయ్య, అంజయ్య, ఆంజనేయులు, అజయ్, శంకర్, స్వామి, రాజన్న, సంపత్, నర్సయ్య,రాజమల్లు,సౌమ్య, కుమార్ ఉన్నారు.

రేకుర్తి భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించండి

కొత్తపల్లి: కొత్తపల్లి తహసీల్ కార్యాలయ పరిధిలోని రేకుర్తి (18, 19వ డివిజన్లు) భూములను ధరణి పోర్టల్‌లోని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరుతూ గురువారం కృషి యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బండారి చంద్రయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ గందె లక్ష్మీనరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. రేకుర్తిలోని వందలాది ఎకరాల భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో ఉంచడం వల్ల ఆ భూముల యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూముల క్రయవిక్రయాలు లేక, విరాసత్‌లు జరగక, కోర్టు పరిధిలో కేసులుండటం వల్ల ఆ భూములను అమ్ముకోలేక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రేకుర్తి భూములపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పట్టా భూములు, వివాదాలు లేని భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. భూ సమస్యలు, న్యాయస్థానం పరిధిలోని వివాదాలు పూర్తయ్యేలా చొరవ చూపి తమను ఆదుకోవాలని చంద్రయ్య కోరారు. యూత్ సభ్యులు చంద్రయ్య, నవీన్, రాజు, సందీప్, సంతోశ్ పాల్గొన్నారు.

'నిజాం, రజాకార్ల బాటలో కేసీఆర్ ప్రభుత్వం'

కరీంనగర్‌టౌన్: తెలంగాణ ప్రజల మానప్రాణాలతో చెలగాటమాడిన నిజాం, రజాకార్ల సంస్కృతి బాటలోనే కేసీఆర్ ప్రభుత్వం నడుస్తుందని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నేషనల్ మైనారిటీ కమిషన్ తెలంగాణ సభ్యులు ఎండీ ముజీబ్ ఒక ప్రకటనలో విమర్శించారు. నాడు నిజాం అకృత్యాలు ఆగడాలను కేసీఆర్ ప్రభుత్వం మరిచిపోయిందని, నిజాం వారసుల అంత్యక్రియలను ప్రభుత్వ అధికారుల లాంఛనాలతో జరపడం దారుణమని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజల మనోభావాల కంటే నిజాం ప్రభువుల ఆరాధన ముఖ్యంగా మారిందని, అందుకే నిజాం కుటుంబం వద్ద మోకరిల్లారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, తెలంగాణ అమరవీరుల ఆకాంక్షలు, ఉద్యమ ఆశయాలు నెరవేర్చడంలో తీవ్రంగా విఫలమైందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను కలుపుకొని, తమ స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను రెచ్చగొట్టడానికి బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తుందని తెలిపారు. నాటి నిజాం మాదిరిగానే తెలంగాణ నుంచి శాశ్వతంగా కేసీఆర్ కుటుంబాన్ని తరిమికొట్టే రోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించారు.